# శాసనమండలి ఎన్నికల్లో బిజెపి, బిఆర్ఎస్ లోపాయికారీ ఒప్పందం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శాసనమండలి ఎన్నికల్లో బిజెపి, బిఆర్ఎస్ లోపాయికారీ ఒప్పందం చేసుకున్నాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆరోపించారు. పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంఎల్‌సి అభ్యర్థి నరేందర్ రెడ్డి గెలవబోతున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ బిజెపి నాయకులు రాహుల్ గాంధీ కులం గురించి బరితెగించి మాట్లాడుతున్నారని విమర్శించారు. దమ్ము, ధైర్యం ఉంటే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ రాష్ట్రానికి నిధులు తీసుకురావాలన్నారు. రాహుల్ గాంధీ, సిఎం రేవంత్ రెడ్డిలను తిట్టడమే కేంద్ర మంత్రుల పనిగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతున్నాడని, ప్రభుత్వాన్ని కూల్చడానికి బిజెపి నాయకులు బిఆర్ఎస్‌తో లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకున్నారా ? అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వానికి రాజ్యాంగబద్ధంగా కావాల్సిన సీట్లు ఉన్నాయని, ఐదేళ్ల పాటు ఇందిరమ్మ రాజ్యం ఉంటుందన్నారు. మరోసారి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని ఆది శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు.

**చరిత్రను వక్రీకరిస్తున్న బండి సంజయ్..**

కేంద్ర మంత్రి బండి సంజయ్ చరిత్రను వక్రీకరించేలా మాట్లాడుతున్నాడని, ఫిరోజ్ జహింగీర్ ఘాండీ(గాంధీ) 1912 సెప్టెంబరు12 అప్పటి బాంబే ప్రెసిడెన్సీ లో జొరాష్ట్రియన్ మతానికి(రతన్ టాటా కుటుంబం పాటించే మతం) చెందిన పార్సీ కుటుంబంలో జన్మించారన్నారు. తండ్రి 'ఫరీదు యన్ జహింగీర్ ఘాండీ' తల్లి 'రతిమయి కమిషరట్ ఘాండీ' జొరాష్ట్రియన్ మతస్తులు పూర్వపు పర్షియా (ఇరాన్) నుంచి భారత దేశానికి వలస వచ్చారని తెలిపారు. భారతదేశంలో జైన, బౌద్ధ, క్రైస్తవ పేర్లు హిందువుల పేర్లకు ఎలా దగ్గరగా ఉంటాయో అలాగే పార్సీల పేర్లు కూడా ముస్లిం పేర్లకు దగ్గరగా ఉంటాయన్నారు. ఫిరోజ్ జహంగీర్ ఘాండీని మహాత్మ గాంధీ దత్తత తీసుకోలేదన్నారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మా గాంధీ అనుచరుడిగా ఆయన మీద అభిమానంతో ఫిరోజ్ ఘాండీ ఫిరోజ్ గాంధీ అని పేరు మార్చుకున్నాడన్నారు. 1942 మార్చి 26 ఫిరోజ్ గాంధీ ఇందిరా ప్రియదర్శినిల వివాహం హిందూ సాంప్రదాయం ప్రకారం జరిగిందని వివరించారు. అప్పటి నుండి ఇందిరా గాంధీ బ్రాహ్మణుడైన నెహ్రూ వారసత్వాన్ని కొనసాగిస్తూ వస్తున్నారన్నారు. వారి పేరు చివరన గాంధీని జోడించుకొని బ్రాహ్మణులుగానే ఉన్నారన్నారు. 1960 సెప్టెంబర్ 8న ఫిరోజ్ గాంధీ అంత్యక్రియలు పార్సీ సాంప్రదాయం ప్రకారం అలహాబాద్‌లో జరిగాయన్నారు. రాహుల్ గాంధీ మతంపైన తప్పుడు ప్రచారం చేస్తున్న బిజెపి నేతలు మేనకా గాంధీ, వరుణ్ గాంధీలను ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. కులగణనను వ్యతిరేకించడమే బిజెపి నేతల వైఖరిగా మారిందని విమర్శించారు. తెలంగాణ బిజెపి నేతలతీరును బిసిలు అర్థం చేసుకోవాలని కోరారు.

# తెలంగాణ తాగునీటి అవసరాలకు రూ.16 వేల కోట్ల నిధులు ఇవ్వండి

'రాజస్థాన్ తాగు, సాగు సదస్సు'లో మంత్రి సీతక్క




**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ తాగునీటి అవసరాలు తీర్చేందుకు 'నీతి ఆయోగ్' గతంలో చేసిన సిఫార్సు మేరకు కనీసం రూ.16 వేల కోట్లను మంజూరు చేయాలని పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రతి ఏటా తాగు నీటి అవసరాల కోసం తెలంగాణ ప్రభుత్వం సుమారు రూ. 5 వేల కోట్లను వెచ్చిస్తుందని, తెలంగాణలోని తాగునీటి వ్యవస్థ స్థిరీకరణ నిమిత్తం అవసరమైన నిధులను మంజూరు చేయాలన్నారు. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో రెండు రోజుల పాటు జరుగుతున్న అన్ని రాష్ట్రాల తాగు, సాగు నీటి పారుదల శాఖ మంత్రుల రెండో సదస్సులో కేంద్ర జల శక్తి శాఖమంత్రి సి.ఆర్ పాటిల్, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, అన్ని రాష్ట్రాల మంత్రులతో పాటు మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న మిషన్ భగీరథ, ఇతర తాగు నీటి పథకాలను ఆమె వివరించడంతో పాటు రాష్ట్ర అవసరాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. దేశ స్వాతంత్రం నుంచి ఇప్పటివరకు దేశంలో, తెలంగాణ ప్రాంతంలో తాగునీటి సరఫరా కోసం ఆయా ప్రభుత్వాలు చేపట్టిన చర్యలను సీతక్క ప్రస్తావించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వేయి కోట్ల ఖర్చుతో చేపట్టిన మిషన్ భగీరథ పనుల వివరాలను వెల్లడించారు. నీరు కేవలం ఒక వనరు మాత్రమే కాదని, అది మానవాళి మనుగడకు జీవనాధారమని చెప్పారు. స్వచ్ఛమైన,సురక్షితమైన తాగు నీటిని పొందడం ప్రజల ప్రాథమిక రాజ్యాంగ హక్కు అని, ఆ హక్కును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని, వేగంగా మారుతున్న వాతావరణ పరిస్థితులు, పెరుగుతున్న అవసరాల నేపథ్యంలో తాగు నీటి కొరతను తీర్చేందుకు రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వం సమన్వయంతో పనిచేయాలని సీతక్క సూచించారు. రూ 28 వేల కోట్ల రుణాలతో ప్రారంభమైన మిషన్ భగీరథ పథకంలో ఉన్న లోపాలను సరిదిద్ది, మరింత పటిష్ట పరిచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కాగా తెలంగాణ రాష్ట్ర అవసరాలు, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను వివరించారు. సీతక్క ప్రజంటేషన్‌ను ప్రశంసించిన కేంద్ర జల శక్తి శాఖ కార్యదర్శి దేబాశ్రీ ముఖర్జీ, మిషన్ భగీరథ బలోపేతానికి తమ వంతు సహకారం ఉంటుందని భరోసానిచ్చినట్టు మంత్రి సీతక్క తెలిపారు.

## సినిమాలకు పిల్లలను అనుమతివ్వాలి

ఇంప్లీడ్ పిటిషన్ వేసిన మల్టీప్లెక్స్ అసోసియేషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉదయం 11 గంటల లోపు, రాత్రి 11 గంటల తర్వాత 16 ఏళ్ల లోపు పిల్లలను అనుమతి ఇవ్వరాదన్న మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేయాలంటూ మల్టీప్లెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేసింది. ఇంప్లీడ్ పిటిషన్‌ను అనుమతిస్తున్నట్లు ప్రకటించిన న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించారు. తదుపరి విచారణను ఈనెల 24కు వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.
గేమ్ చేంజర్ సినిమా అదనపు ప్రదర్శనలకు, టిక్కెట్ ధరల పెంపునకు అనుమతిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేసిన కేసులో సంబంధం లేని అంశంలోకి వెళ్లి పిల్లలను రాత్రివేళ షోలకు అనుమతి ఇవ్వరాదన్న ఉత్తర్వులు చెల్లవని పిటిషనర్ వాదన.

## కేసు కొట్టేయాలని నాగం పిటిషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అసెంబ్లీకి 2023లో జరిగిన ఎన్నికలప్పుడు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి ర్యాలీ నిర్వహించారంటూ పోలీసులు పెట్టిన కేసును కొట్టేయాలని కోరుతూ బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి నాగం జనార్ధన్‌రెడ్డి హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేశారు. 2023, నవంబర్ 26న అనుమతి లేకుండా దాదాపు 300 మందితో నాగర్‌కర్నూల్ జిల్లా శ్రీపురం గ్రామంలోని రాత్రి ర్యాలీ నిర్వహించారని ఆయనపై ఎన్నికల అధికారి ఫిర్యాదు చేశారు. కింది కోర్టులో ఉన్న ఆ కేసును కొట్టేయాలని నాగం హైకోర్టును ఆశ్రయించారు.

## అసైన్డ్ ల్యాండ్స్ అమ్మకాలపై విచారణ చేయండి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కొందరు లాభాపేక్షే లక్ష్యంగా చేసుకుని చట్ట వ్యతిరేకంగా అసైన్డ్ భూములను అమ్ముతున్నారని, ఫలితంగా అమాయకులు నష్టపోతున్నారని హైకోర్టు వ్యాఖ్యానించింది. కొందరు మోసగాళ్లు, రెవెన్యూ ఆఫీసర్లు సబ్ రిజిస్ట్రార్లతో కుమ్మక్కు కావడంతో ఈ దారుణాలకు తెరలేస్తోందని అభిప్రాయపడింది. 1977 అసైన్డ్ యాక్ట్ ప్రకారం రూల్స్‌ను ఉల్లంఘిస్తే ప్రభుత్వం ఆ భూముల్ని తీసేసుకునే అధికారం ఉందని చెప్పింది. అమ్మకాలకు చెందిన దస్తావేజు డాక్యుమెంట్స్ లేకపోయినప్పటికీ అమ్మకాలు జరగడంపై ఆందోళన వ్యక్తం చేసింది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలో అసైన్డ్ భూమి అమ్మకాలు జరగడంపై 3 నెలల్లోగా జిల్లా కలెక్టర్ విచారణ పూర్తి చేసి బాధ్యులైన వాళ్లపై క్రిమినల్ కేసు నమోదు చేయాలంది. మొయినాబాద్‌లోని సర్వే నెం 178/23లోని భూమిని తమ సమ్మతి లేకుండా అమ్మకాలు చేయడంపై నాగమ్మ ఆమె ముగ్గురు కొడుకులు వేసిన పిటిషన్‌ను జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి మంగలశారం విచారించారు. భర్త మృతి తర్వాత అసైన్డ్ భూమిని కొందరు 2021లో విక్రయించారన్నారు. విక్రయించేముందు తల్లితోపాటు ఇతర వారసుల అంగీకారం తీసుకోలేదన్నారు. దీనిపై న్యాయమూర్తి, తెలంగాణ ల్యాండ్ రెవెన్యూ యాక్ట్ 1317 ఫసలీ ప్రకారం అసైన్డ్ భూమిని వ్యవసాయానికి మాత్రమే వినియోగించాలని, అందుకు విరుద్ధంగా చేస్తే ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవచ్చునని చెప్పారు. అసైన్డ్ చట్టంలోని సెక్షన్ 7 (2ఎ) ప్రకారం ఏ అధికారి అయినా 5 (1) (2) కింద్ర నిబంధనలను ఉల్లంఘిస్తే ఆరు నెలల సాధారణ జైలు రూ.10 వేలు జరిమానా విధించేందుకు వీలుందన్నారు. ఈ కేసులో పిటిషనర్లు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించాలని, వినతి పత్రం అందిన మూడు నెలల్లోగా కలెక్టర్ విచారణ జరిపి బాధ్యులపై చట్టప్రకారం క్రిమినల్ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పిటిషన్‌పై విచారణను క్లోజ్ చేశారు.

## నేడు శివాజీ జయంతి వేడుకలకు అనుమతి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ఈనెల 19న హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమానికి అనుమతించాలని హైదరాబాద్ సీపీకి హైకోర్టు ఆదేశించింది. సుందర్ భవన్ నుంచి ట్రూప్ బజార్, జాంబాగ్ వరకు 150 మందితో శివాజీ జయంతి వేడుకలను నిర్వహించేందుకు పర్మిషన్ ఇచ్చింది. పలు షరతులు విధించింది. అవాంచనీయ సంఘటనలు జరగకుండా 150 మందికి మించకుండా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించుకోవాలంది. నేరచరిత్ర ఉన్నవారిని అనుమతించరాదని, రెచ్చగొట్టే వ్యాఖ్యలు నినాదాలు చేయరాదని నిర్వహకులను ఆదేశించింది. వీటిని ఉల్లంఘించి శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే పోలీసులు నిర్వాహకులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవచ్చునని చెప్పింది. ఈనెల 17న సమర్పించిన వినతి పత్రంపై సిటీ పోలీస్ కమిషనర్ చర్యలు లేవంటూ వీర్ శివాజి సేన, గోల్కొండ బీజేపీ యువజన మోర్చా అధ్యక్షుడు నితిన్ నంద్కర్ లంచ్‌మోషన్ పిటిషన్‌ను జస్టిస్ బి విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు.

## బెయిల్ పిటిషన్లను పరిష్కరించాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకుడు చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు నమోదైన 'ఫోన్ ట్యాపింగ్' కేసులో నిందితులు(4, 5) దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను త్వరగా పరిష్కరించాలని ట్రయల్ కోర్టును హైకోర్టు ఆదేశించింది. పిటిషనర్ల బెయిల్ పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకోవాలని మెజిస్ట్రేట్‌కు ఆదేశాలు జారీ చేయాలన్న పిటిషనర్ తరపు న్యాయవాది అభ్యర్థనను తిరస్కరించింది. ట్రయల్ కోర్టులో మెరిట్ ఆధారంగా కేసులో వాదనలు వినిపించాలంది. గత ప్రభుత్వ హయాంలో తన ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డారని పేర్కొంటూ చక్రధర్‌గౌడ్ పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేసిన కేసులో మాజీ మంత్రి హరీశ్‌రావును ఏ1గా, రాధాకిషన్‌రావును ఏ2గా, సంతోశ్‌కుమార్‌ను ఏ4గా, పర్శ రాములును ఏ5గా ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. హరీశ్‌రావు, రాధాకిషన్ రావు హైకోర్టును ఆశ్రయించగా.. అరెస్టు చేయవద్దని ఆదేశించింది. ఈ క్రమంలో తమను అరెస్టు చేశారని, బెయిల్ ఇవ్వాలని కోరుతూ సిద్దిపేట్‌కు చెందిన ఏ4, ఏ5 హైకోర్టులో లంచ్ మోషన్ రూపంలో మంగళవారం పిటిషన్‌పై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. బెయిల్ పిటిషన్లను త్వరగా పరిష్కరించాలని దిగువ కోర్టుకు ఆదేశాలు జారీ చేశారు.

## క్యాన్సర్ అంశాలపై అవగాహన



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళలలో వచ్చే రొమ్ము క్యాన్సర్‌తో పాటూ కడుపులోని పలు భాగాలకు వచ్చే క్యాన్సర్లు అత్యంత త్వరితగతిన ఎదుగడానికి కారణమయ్యే హెచ్‌ఈఆర్ 2 ప్రొటీన్‌కు సంబంధించిన టెస్టుపై బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన లాబొరేటరీ మెడిసన్ విభాగం ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించింది. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహించిన ఈ శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆస్పత్రి ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ ప్రారంభించారు. బాలకృష్ణ మాట్లాడుతూ గత 25 సంవత్సరాలలో హాస్పిటల్ సాధించిన నైపుణ్యాన్ని, మెళుకువలను తోటి వైద్యులతో పంచుకోవడంతో పాటు భావి తరాలవారికి శిక్షణ అందించే కార్యక్రమాన్ని సంస్థ మొదటి నుండి కొనసాగిస్తోందన్నారు. తద్వారా విజ్ఞానాన్ని ఇచ్చి పుచ్చుకోవడంతో రోగులకు మరింత మేలు చేయడానికి, క్యాన్సర్ వ్యాధికి సంబంధించిన పలు అంశాలపై అవగాహన కలిగించడానికి వీలవుతుందన్నారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని యువ వైద్యులు చక్కగా వినియోగించుకోవాలన్నారు. ఛీఫ్ పాథాలజిస్టు సుశీల కోదండపాణి మాట్లాడుతూ సాలిడ్ ట్యూమర్లలలో హెచ్‌ఈఆర్ 2 టెస్టింగ్ చేయడంతో ఏర్పడే ప్రయోజనాలను వివరించడమే కాకుండా పరీక్షకు సంబంధించిన మెళుకువలు, ఫలితాలను విశ్లేషించే విధానాలు వంటి వాటిని ఈ కార్యక్రమంలో సీనియర్ వైద్యుల ద్వారా వివరించడం జరుగుతుందన్నారు. ప్రొఫెసర్ ఆఫ్ పాథాలజీ, ఎండి ఆండర్సన్ క్యాన్సర్ సెంటర్, హూస్టన్, అమెరికా డాక్టర్ సావిత్రి కృష్ణమూర్తితో పాటూ పలువురు సీనియర్ పాథాలజిస్టులు తమ తమ అనుభవాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిఈఓ డాక్టర్ కె. కృష్ణయ్య, డాక్టర్ టిఓస్ రావు, డాక్టర్ ఫణి కోటేశ్వర రావు, పలువురు వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

## దుర్గం చెరువు పరిరక్షణ.. చర్యలకు ఉపక్రమించిన యంత్రాంగం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దుర్గం చెరువు పరిరక్షణకు ప్రభుత్వం సిద్ధమైంది. చెరువులో మురుగు నీరు చేరి అది కలుషితం కాకుండా తగిన చర్యలు చేపట్టనుంది. అందులో భాగంగానే పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం. దానకిశోర్ ఆదేశాల మేరకు.. చెరువు పరిసరాలను జల మండలి ఎం.డి. అశోక్ రెడ్డి, ఈ.డి. మయాంక్ మిట్టల్, జిహెచ్‌ఎంసి, హెచ్‌ఎండిఏ, నీటిపారుల, రెవెన్యూ, కాలుష్య నియంత్రణ మండలి తదితర విభాగాల అధికారులు పరిశీలించారు. చెరువులో మురుగు నీరు చేరకుండా తగిన చర్యలు చేపట్టడానికి సంయుక్త పరిశీలిన నిర్వహించారు. రహేజా మైండ్ స్పేస్ ప్రాంతాల్లో భవన నిర్మాణ, గార్డెనింగ్, ల్యాండ్ స్కేపింగ్ అవసరాల కోసం ఎస్‌టిపిలో శుద్ధి చేసిన నీటినే వాడుకోవాలని జలమండలి ఎం.డి. అశోక్ రెడ్డి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జల మండలి ప్రాజెక్టు సిజిఎం పద్మజ, ఓఎస్‌డి సత్యలింగం, జిహెచ్‌ఎంసి శేరిలింగంపల్లి కమిషనర్ ఉపేందర్ రెడ్డి, డిప్యూటి కమిషనర్ ముకుంద్ రెడ్డి, ఈఈ దుర్గా ప్రసాద్, ఈఈ లేక్స్ నారాయణ, ఎలక్ట్రికల్, ఫిషరీస్ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

**తీసుకునే చర్యలివే..**

మాదాపూర్, సైలెంట్ వాలీ ప్రాంతాలు, క్యాచ్ మెంట్ ఏరియాలో ఉత్పన్నమవుతున్న మురుగునీటిని జలమండలి దుర్గం చెరువులో నిర్మించిన రెండు ఎస్‌టిపిల (5 అండ్ 7 ఎంఎల్‌డిలు ) ద్వారా శుద్ధి చేస్తున్నారు. దుర్గం చెరువు భూగర్భ నీటి మట్టం పెరిగేందుకు, చెరువు హైడ్రాలజీ కాపాడేందుకు ఎస్‌టిపిల్లో శుద్ధి చేసిన నీటిని చెరువులోకి వదిలి పెడుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి అధికంగా వచ్చే మురుగు నీరు చెరువులో కలవకుండా 1000 ఎంఎం డయా పైపులైన్‌ను మాదాపూర్ పెట్రోల్ బంక్ నుంచి మాదాపూర్ ఐ అండ్ డి వరకు నిర్మించేందుకు ప్రతిపాదనలు సైతం సిద్ధం చేశారు. ప్రస్తుతం ఈ పనులు టెండర్ దశలో ఉన్నాయి. టెండర్ ఖరారయ్యాక, వచ్చే 3 నెలల్లో పైపులైన్ నిర్మాణ పనుల్ని పూర్తి చేయనున్నారు. దీని వల్ల లేక్ పార్కులో జరుగుతున్న సీవరేజ్ ఓవర్ ఫ్లో కూడా తగ్గనుంది.
వర్షాకాలంలో వచ్చే వరద నీరు చెరువులో కలవకుండా వాటర్ డ్రైయిన్ సైతం నిర్మించనున్నారు. జిహెచ్‌ఎంసి ఈ నిర్మాణ పనుల్ని చేపట్టి, 3 నెలల్లో పూర్తి చేయనుంది. దుర్గం చెరువు చుట్టు పక్కల నివాసాల నుంచి వచ్చే సిల్ట్ డైవర్షన్ మెయిన్‌లో కలకుండా, సిల్ట్ ఛాంబర్లు నిర్మించుకోవాలని వారికి నోటీసులు జారీ చేయాలని నిర్ణయించారు.
చెరువు చుట్టుపక్కల ఉన్న డైవర్షన్ మెయిన్ మ్యాన్ హోళ్లను పరిశీలించాలని రహేజా గ్రూప్ సంస్థను ఆదేశించారు. చెరువులో సిఎస్ఆర్, అభివృద్ధి, సుందరీకరణ పనులు చేపట్టినప్పుడు మ్యాన్ హోళ్ల ఎత్తు తగ్గడం కానీ, ధ్వంసం కావడం కానీ లాంటివి జరిగితే గుర్తించి, వాటికి మరమ్మతులు చేసి జలమండలి అధికారులతో సమన్వయం చేసుకుని రోడ్డుకు సమాంతరంగా చేయాలన్నారు. ఒకవేళ డైవర్షన్ మెయిన్ చోకేజీ అయితే డీసిల్టింగ్ చేయడానికి వీలుగా ప్రతి నాలుగో మ్యాన్ హోల్డ్‌ను రోడ్డుకు సమాంతరంగా నిర్మించి, సేఫ్టీ గ్రిల్ ఏర్పాటు చేయాలని సూచించారు.
చెరువు భూగర్భ జలాల స్థాయిలను కాపాడేందుకు ఎస్‌టిపిలో శుద్ధి చేసిన నీటిని పార్కులో నిర్వహణ పనులకు, చెట్లు పెంచేందుకు ఉపయోగించాలని సూచించారు.
రహేజా మైండ్ స్పేస్ ప్రాంతాల్లో భవన నిర్మాణ, పార్కు, ల్యాండ్ స్కేప్ నిర్వహణకు ఇతర అవసరాలకు తప్పనిసరిగా వంద శాతం రీసైకిల్ వాటర్‌నే వినియోగించాలని ఎం.డి.అశోక్ రెడ్డి ఆదేశించారు. అందుకోసం వారం లోపల దుర్గం చెరువు ఎస్‌టిపి నుంచి ప్రత్యేక పైప్‌లైన్‌ను నిర్మించాలని ఆదేశించారు. దుర్గం చెరువు ఎస్‌టిపి నుంచి శుద్ధి చేసిన నీటిని తరలించి వాడుకునేలాగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ప్రాంతంలోని జిహెచ్‌ఎంసి, హెచ్‌ఎండిఏ అధీనంలో ఉన్న పార్కులు, ల్యాండ్ స్కేపింగ్‌లలో రీసైకిల్ నీటినే వాడేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## 'జస్టిస్ డాక్టర్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్' కాలపరిమితి పొడిగింపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎస్‌సి వర్గీకరణ నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మాజీ న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్‌ను కాలపరిమితిని రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. మార్చి 10 వరకు కమిషన్ కాలపరి మితిని పెంచింది. రాష్ట్రంలో ఎస్‌సి వర్గీకరణపై అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం హైకోర్ట్ మాజీ న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ షమీమ్ అక్తర్ ఆధ్వర్యంలో ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.
ఈ కమిషన్ గడువు జనవరి 10వ తేదీతో గడువు ముగియగా మరో పది రోజులను పెంచింది. ఇటీవలే కమిషన్ తన అధ్యయన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. అయితే ఎస్‌సి వర్గీకరణపై పలు అభ్యంతరాలు లేవనెత్తారు. పైగా వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టే క్రమంలో మరిన్ని మార్పులు చేసే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ఏకసభ్య కమిషన్ గడువును పెంచారు.

## విద్యారంగానికి 10 నుంచి 12 శాతం నిధులను పెంచండి

ఆర్థిక శాఖకు తెలంగాణ విద్యా కమిషన్ సిఫారసు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి నిధులను పెంచాలని తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసినట్టు తెలిసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7.4 శాతం మాత్రమే నిధులను కేటాయించారని, వచ్చే 2025–26 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో 10 నుంచి 12 శాతం నిధులను కేటాయించాలని ఆర్థిక శాఖకు ప్రతిపాదించినట్టు తెలిసింది. ఈ మేరకు తెలంగాణ విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళీ, సభ్యులు ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వర్ రావు తదితరుల బృందం ఆర్థిక శాఖకు ప్రతిపాదనలను అందజేసినట్టు తెలిసింది. పాఠశాల, ఉన్నత విద్యా, సాంకేతిక విద్యా శాఖలకు నిధులను పెంచాలని, అలాగే మిడ్‌డే మిల్స్‌ను మరింత బలోపేతం చేయాలని సూచించినట్టు సమాచారం. అయితే విద్యా రంగానికి నిధుల కేటాయింపు ప్రతిపాదనల అంశంపైన మరోసారి ఆర్థిక శాఖతో తెలంగాణ విద్యా కమిషన్ సమావేశం కానున్నట్టు తెలిసింది.

## సర్వేకు సహకరించని సంపన్న వర్గాలు

దూరంగా గేటెడ్ కమ్యూనిటీలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సంపన్న వర్గాలకు సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వేకు సహకరించడం లేదు. ఈ విషయం జిహెచ్‌ఎంసి యంత్రాంగం పరిశీలనలో తేలింది. ప్రధానంగా గేటెడ్ కమ్యూనిటీ, అపార్ట్‌మెంట్, సంపన్న వర్గాలు నివాసం ఉండే కాలనీల్లోకి సర్వే సిబ్బందిని అనుమతించడం లేదనే సమాచారం జిహెచ్‌ఎంసి యంత్రాంగం ద్వారా తెలుస్తోంది. కొన్ని గేటెడ్ కమ్యూనిటీలలో కుక్కలు ఉండటంతో లోపలికి వెళ్లేందుకు సర్వే సిబ్బంది జంకుతున్నారు. వారిని పిలిచిన తమకు సర్వే అక్కర్లేదనే నిర్లక్ష్యంతో కూడిన సమాధానం వస్తుందని సిబ్బంది తెలిపారు. కొంతమంది అయితే తమకు ప్రభుత్వం నుంచి అందాల్సిన సంక్షేమ పథకాలు అవసరం లేదని, తాము సర్వేకు వివరాలు ఇవ్వమని కూడా చెప్పుతున్నట్లు పేరు చెప్పడానికి అధికారి ఒకరు చెప్పారు. అయితే జిహెచ్‌ఎంసి సిబ్బంది మాత్రం ఇంటింటికి తిరుగతూ వారి వివరాలు సేకరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధానంగా ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 5 గంటల తరువాత కూడా సర్వే జరుపుతున్నట్లు అధికారులు చెప్పుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో పరిధిలో సర్వే సంపూర్ణంగా కాలేదని గుర్తించిన ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించింది. ఆదివారం నుంచి ఈనెల 28 వరకు ఈ సర్వే కొనసాగనుంది. ఆదివారం వివిధ మార్గాల ద్వారా 43 ధరఖాస్తులు అందాయి. అయితే, రాబోయే రోజుల్లో సంఖ్యలు పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 3.1 శాతం జనాభా సర్వేలో పాల్గొనలేదని ప్రభుత్వం పేర్కొంది. 3.1 శాతంలో అత్యధికంగా జిహెచ్‌ఎంసితో పాటు శివారు మున్సిపల్ కార్పొరేషన్‌లు, మున్సిపాలిటిలలోనే ఉన్నారు. నగరంలో దాదాపు 24 లక్షల కుటుంబాలకు, ఇప్పటివరకు దాదాపు 20 లక్షలు మాత్రమే సర్వే కోసం తమ వివరాలను ఇచ్చారు. చాలా మంది తమ స్వగ్రామంలో వివరాలు ఇచ్చామని, 70,000 కంటే ఎక్కువ గృహాలను 'డోర్ లాక్' చేసినట్లు సర్వే సిబ్బంది గుర్తించారు. సర్వే వివరాలు ఖచ్చితమైనవి సేకరించాలంటే ఇంకా తగినంత సమయం కూడా ఇవ్వాల్సి ఉంటుందని ఒక అధికారి అభిప్రాయం వ్యక్తం చేశారు. సంపన్న వర్గాలు నివాసం ఉండే ప్రాంతాలు, గేటెడ్ కమ్యూనిటీలలో నివాసం ఉండే ప్రజలు సర్వేకు సహకరించడం లేదని తెలుస్తుంది. వివిధ భయాల కారణంగా సర్వేకు దూరంగా ఉన్నారని మరొక అధికారి తెలిపారు. సర్వేకు వివరాలు అందించాలనుకునేవారు ప్రజాపాలన కేంద్రాలలో సంప్రదించాలని, ప్రత్యామ్నాయంగా, జిహెచ్‌ఎంసి సర్కిల్ కార్యాలయాలలో వివరాలను అందచేసేందుకు అవకాశం కల్పించారు. జిహెచ్‌ఎంసి కాల్ సెంటర్‌కు 040–21111111కు కాల్ చేస్తే సర్వే సిబ్బంది వారి నివాసానికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. సర్వేకు సహకరించని సంపన్న వర్గాల విషయంలో ప్రభుత్వం కానీ అధికార యంత్రాంగం ఏలా నిర్ణయం తీసుకుటుందనే విషయం చూడాల్సి ఉంది.

## విఆర్‌ఒలకు పరీక్షలు పెట్టకుండానే యథావిధిగా నియమించండి

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరిన టివిఆర్ఒ జెఎసి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నూతన గ్రామ రెవెన్యూ వ్యవస్థలో రద్దయిన విఆర్‌ఒలను యథావిధిగా నియమించాలని టివిఆర్ఒ జెఎసి ఛైర్మన్ గోల్కొండ సతీష్ రాష్ట్ర రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరారు. రద్దయిన విఆర్ఒ వ్యవస్థను మళ్లీ గ్రామ రెవెన్యూ వ్యవస్థలోకి తీసుకురావాలంటే, వారిని పరీక్షల ద్వారా నియమిస్తామని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయము సరికాదని మంత్రికి వివరించారు. హైదరాబాద్ లోని మంత్రుల నివాసంలో టిఆర్‌ఇఎస్‌ఎ అధ్యక్షుడు వంగ రవీందర్ రెడ్డితో కలిసి గోల్కొండ సతీష్ మంత్రి శ్రీనివాస్ రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం అనాలోచిత విధానంతో అశాస్త్రీయంగా గ్రామ రెవెన్యూ వ్యవస్థను రద్దు చేసి ప్రజలకు, గ్రామ రెవెన్యూ అధికారులకు మధ్య తగాదాలు పెట్టిందని, గ్రామ రెవెన్యూ వ్యవస్థను రద్దు చేసే విధంగా కుట్రపూరిత విధానాలతో ముందుకెళ్లిందని ఈ సందర్భంగా గోల్కొండ సతీష్ ఆరోపించారు. నూతన గ్రామ రెవెన్యూ వ్యవస్థను తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సంతోషకరమన్నారు.

## అగస్టా వెస్ట్‌లాండ్ కుంభకోణం కేసులో... క్రిస్టియన్ మిచెల్ జేమ్స్‌కు 'సుప్రీం' బెయిల్




6 సంవత్సరాలు కస్టడీలోనే ఉన్న జేమ్స్
12వివిఐపి హెలికాప్టర్ల కొనుగోలులో రూ.3,600 కోట్ల అవకతవకల ఆరోపణలపై సిబిఐ దర్యాప్తు కేసు

**న్యూఢిల్లీ :** కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) దర్యాప్తు చేస్తున్న రూ.3,600కోట్ల అగస్టా వెస్ట్‌లాండ్ కుంభకోణం కేసులో మధ్యవర్తిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న క్రిస్టియన్ మిచెల్ జేమ్స్‌కు సుప్రీంకోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. గత ఆరు ఏళ్లుగా జేమ్స్ కస్టడీలో ఉండగానే విచారణ కొనసాగుతున్నదన్న విషయాన్ని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహ్‌తాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం పరిశీలించింది. అయితే జేమ్స్ మనీల్యాండరింగ్ కేసును ఎదుర్కొంటున్నందున, అతడి బెయిల్ అభ్యర్థన ఢిల్లీ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న కారణంగా జేమ్స్ బయటకు వెళ్లలేడు.' పిటిషనర్‌ను 2018లో రప్పించారు. ఆయన నాటి నుంచి ఇప్పటివరకూ 6సంవత్సరాలకు పైగానే కస్టడీలోనే ఉన్నాడు. సిబిఐ ప్రకారం రెండు చార్జిషీట్లు, ఒక అనుబంధ చార్జిషీట్ దాఖలు చేసినప్పటికీ దర్యాప్తు ఇంకా కొనసాగుతూనే ఉంది. షరతులతో నిశ్చయించబడిన ట్రయల్ కోర్టులో బెయిల్ మంజూరు చేయడానికి సిబిఐ మొగ్గు చూపుతోంది. అవసరమైన షరతులు విధిస్తూ ట్రయల్ కోర్టుకు తగిన అభ్యర్థనను సిబిఐ చేస్తుంది' అని ధర్మాసనం తెలిపింది. ట్రయల్‌కోర్టు నిర్ణయించిన నిబంధనలు, షరతుల ప్రకారం జేమ్స్ బెయిల్‌పై విడుదల కానున్నారని అత్యున్నత న్యాయస్థానం తెలియజేసింది. అదనపు సొలిసిటర్ జనరల్ వాదనలు వినిపించేందుకు అందుబాటులో లేనందున కొంత గడువు కోరారు. బెంచ్ బెయిల్ మంజూరు చేయడానికి మొగ్గు చూపినప్పుడు సిబిఐ న్యాయవాది మాట్లాడుతూ దాఖలుచేసిన అభ్యర్థన ఆరోగ్య కారణాలపై మాత్రమే బెయిల్‌ను కోరడం జరిగిందన్నారు. ఈ కేసు విచారణ, ట్రయల్ కేసు విచారణలో ఎందుకు ఆలస్యం అయ్యిందని ఈ సందర్భంగా కోర్టు ప్రశ్నించింది. విచారణలో వేగం పెంచాలని చెప్పినప్పటికీ విచారణ మరో 25సంవత్సరాలలో కూడా ముగియనట్లున్నదని అభిప్రాయం వ్యక్తం చేసింది. క్రిస్టియన్ మిచెల్ జేమ్స్ తరపున కేసుకు ప్రాతినిధ్యం వహించిన న్యాయవాదులు ఆల్జో కె జోసెఫ్, విష్ణుశంకర్‌లు ఆరు సంవత్సరాలుగా జేమ్స్ అనుభవిస్తున్న సుదీర్ఘ జైలు శిక్షను ప్రస్తావించారు. డిసెంబరు 6న జేమ్స్ అభ్యర్థనపై సిబిఐ స్పందించాలని సుప్రీంకోర్టు కోరింది. చాపర్ డిజైనింగ్, తయారీ కంపెనీ అగస్టా వెస్ట్‌లాండ్ నుంచి 12వివిఐపి హెలీక్యాప్టర్ల కొనుగోలులో అవకతవకలు చోటు చేసుకున్నాయన్న ఆరోపణలకు సంబంధించిన కేసు ఇది. ఈ కేసులో క్రిస్టియన్ మిచెల్ జేమ్స్ పెట్టుకున్న బెయిల్‌ను 2024 సెప్టెంబరు 25న ఢిల్లీ హైకోర్టు తిరస్కరించడాన్ని సవాల్ చేస్తూ జేమ్స్ సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. బ్రిటీష్ జాతీయుడైన క్రిస్టియన్ మిచెల్ జేమ్స్‌ను డిసెంబరులో దుబాయ్ నుండి రప్పించి అరెస్ట్ చేయడం జరిగింది. హైకోర్టు ఇంతకుముందు జేమ్స్ బెయిల్ అప్లికేషన్‌ను డిస్మిస్ చేసింది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ముగ్గురు మధ్యవర్తులలో గుయిడో హాశ్చ్‌కే మొదటి వ్యక్తి కాగా, రెండవ వ్యక్తి కార్లో గెరోసా, మధ్యవర్తిగా ఉన్నటువంటి మూడవ వ్యక్తి క్రిస్టియన్ మిచెల్ జేమ్స్. సిబిఐ తన చార్జిషీట్‌లో అంచనా నష్టం 398.21 మిలియన్ల యూరోలు అని పేర్కొంది. ఈ మొత్తం దాదాపు 2,666కోట్లు (మన కరెన్సీ) విలువగా ఉంటుందని సిబిఐ తెలిపింది. ఈ ఒప్పందం 2010, ఫిబ్రవరి 8న జరిగిందని తెలియజేసింది. ఈ 12వివిఐపి చాపర్ల సరఫరా విలువ 556.262 మిలియన్ల యూరోలు అని తెలియజేసింది.

## భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు : దేప



ప్రజాపక్షం/సరూర్‌నగర్ : భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు జరుపుకోవాలని టిపిసిసి సభ్యుడు దేప భాస్కర్ రెడ్డి అన్నారు. మహేశ్వరం మండలం రాజరాజేశ్వరిదేవి ఆలయంలో ఈనెల 25నుంచి జరిగే బ్రహ్మోత్సవాలకు సంబందించిన ఆహ్వానపత్రాన్ని ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్ మంగళవారం భాస్కర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో నాగేందర్ రెడ్డి, సుభాష్‌యాదవ్, నరసింహాచారి, రాజు, సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

# మహానగరి

## శాంతిభద్రతల పరిరక్షణకు సహకారం



ప్రజాపక్షం/కొందుర్గు: మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని ఎస్ఐ రవీందర్ నాయక్ కోరారు. మంగళవారం మండల ఎమ్మార్పిఎస్ నాయకులు నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన రవీందర్‌నాయక్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఆనేగళ్ల అనంద్, గూడెం చెన్నయ్య, కె.వెంకటేష్, చింతకింది సిద్దు, బి.దిలీప్ కుమార్, ఎం.రాజు, జె.విజయ్‌కుమార్, బి.సురేష్, సిబి శ్రీకాంత్, బి.కబీర్ దాస్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నిధులు



ప్రజాపక్షం/కొత్తూరు: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజురు చేస్తుందని కొత్తూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొంగళ్ల హరినాథ్‌రెడ్డి వివరించారు. మంగళవారం మండల పరిధిలోని కొడిచెర్ల గ్రామంలో రూ.10లక్షలతో సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలను అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎల్లారం శేఖర్‌రెడ్డి, మల్లిఖార్జున్‌రెడ్డి, రాఘువేందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, యాదయ్య, చందురెడ్డి, నవీన్, కృష్ణ, శ్రీధర్, శ్రీకాంత్, సాయిరెడ్డి, మైపాల్‌రెడ్డి, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారంలో బిఎన్‌రెడ్డి నగర్ కార్పొరేటర్ లచ్చిరెడ్డి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : కరీంనగర్, అదిలాబాద్, మెదక్ గ్యాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలో బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ప్రచారం చేశారు. మంగళవారం బాల్కొండ నియోజకవర్గంలోని మోర్తాడ్ మండలంలో మండల స్థాయి సమీక్ష సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బిజెపి ఉమ్మడి కరీంనగర్, అదిలాబాద్, మెదక్, నిజామాబాద్ గ్యాడ్యుయేట్ ఎంఎల్‌సి అభ్యర్థి డా. అంజిరెడ్డి చిన్నమైల్‌ని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో మల్లికార్జున్, నరేష్, విష్ణువర్ధన్‌రెడ్డి, పవన్‌రెడ్డి, నాయకులు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## వనస్థలిపురం డివిజన్ అభివృద్ధికి కృషి

కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి



ప్రజాపక్షం/ఎల్‌బినగర్ : వనస్థలిపురం డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తున్నట్టు వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్‌లోని బికెఎస్ గ్రౌండ్‌లో అభివృద్ధి పనులను కాలనీ వాసులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రౌండ్‌లో సుందరీకరణ చేయడం ద్వారా కాలనీ వాసులకు, ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు జగదీష్ గుప్తా, హెచ్‌ఎండిఎ అధికారి గోపి, నాయకులు కుంచ సాయికిరణ్ గౌడ్, వీరప్ప రాంరెడ్డి, రత్నాకర్, భాస్కర్ రావు, నర్సింహారెడ్డి, బాలరాజ్, విజయ్, హరిబాబు పాల్గొన్నారు.

## ఆరోపణలు అర్ధరహితం : బిఆర్‌ఎస్



ప్రజాపక్షం/ఎల్‌బినగర్ : హస్తినాపురం డివిజన్‌లో కార్పొరేటర్, మాజీ ఎంపిల పిఎలు డివిజన్‌పై అవగాహన లేని విధంగా బిఆర్‌ఎస్ నాయకులపై కేసు పెట్టించే ప్రయత్నం చేయిస్తున్నారని, వాస్తవాలు లేని ఆరోపణలు అర్ధరహితంగా ఉందని హస్తినాపురం మాజీ కార్పొరేటర్ రమావత్ పద్మ నాయక్, బిఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు ఆందోజు సత్యం చారి అన్నారు. మంగళవారం హస్తినాపురంలోని జడ్పీ రోడ్డులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీలు మారి ప్రజలకు అభివృద్ధి చేయకుండా నాయకులపై ప్రతాపం చూపడం ఎంతవరకు సమంజసం అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ జన్మదినం రోజు ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటితే పాఠశాల ప్రధానోపాధ్యాయుడిపై వేటు వేయించడం సిగ్గుచేటన్నారు. అభివృద్ధి పనుల్లో కార్పొరేటర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని వారు తెలిపారు. హస్తినాపురం డివిజన్‌లో ఎల్‌బినగర్ ఎంఎల్‌ఎ సుధీర్‌రెడ్డి ని కాదని, కనీసం ప్రోటో కాల్ పాటించకుండా శంకుస్థాపనలు, ప్రారంభంలను చేస్తున్న కార్పొరేటర్‌ను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో నారగోని శ్రీనివాస్ యాదవ్, రఘుమారెడ్డి, సయ్యద్ పాష, నిర్మల, విష్ణు గౌడ్, బిక్షం, నరేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## వాసవీ కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం ఎల్‌బినగర్ అధ్యక్షుడిగా రవిగుప్త



ప్రజాపక్షం/సరూర్‌నగర్: వాసవి కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం ఎల్‌బినగర్ అధ్యక్షుడిగా కొత్త రవిగుప్త నియమితులయ్యారు. మంగళవారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా కొత్త రవిగుప్త మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఉన్నత చదువుల కోసం ఆర్థికంగా బాధపడే వారికి తన వంతు సహాయం అందిస్తామన్నారు. వైద్యం, వివాహం ఇతర సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మంచికంటి రమేష్‌గుప్తా, నాగభూషణంగుప్తా, ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, తెలుకుంట్ల అశోక్ గుప్తా, ఉప్పల నగేష్‌గుప్త, రాజు, నాగరాజు, పురుషోత్తం, ప్రవీణ్, సత్యం, రవిందర్, అంజయ్య, రమణ, శేఖర్, చంద్రశేఖర్, శ్రీనివాస్, విజయ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# సత్వరమే భూసేకరణ పూర్తి

### జిహెచ్‌ఎంసి కమిషనర్ ఇలంబర్తి

గోల్నాక నుంచి అంబర్ పేట్ వరకు పనుల పరిశీలన





ప్రజాపక్షం/హైదరాబాద్ : జాతీయ రహదారులు, రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో గోల్నాక నుండి అంబర్ పేట్ వరకు సుమారు రూ. 335 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఫ్లైఓవర్ నిర్మాణానికి అసంపూర్తిగా ఉన్న భూసేకరణ పనులను సత్వరమే పూర్తి చేయాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఇలంబర్తి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆర్‌అండ్‌బి జాతీయ రహదారి శాఖ ఎస్ఇ, జిహెచ్‌ఎంసి అదనపు, జోనల్ కమిషనర్లు, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి జిహెచ్‌ఎంసి కమిషనర్ ఫ్లైఓవర్‌కు సంబంధించి అసంపూర్తిగా ఉన్న భూసేకరణ పనులను మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఎస్ఇ ధర్మారెడ్డి ఫ్లైఓవర్‌కు సంబంధించిన సివిల్ పనులు పూర్తయ్యాయని, సర్వీస్ రోడ్లు నిర్మించేందుకు వివిధ ప్రాంతాల్లో భూసేకరణ ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత పనులను కొనసాగించడం జరుగుతుందని ఎస్‌ఇ ధర్మారెడ్డి జిహెచ్‌ఎంసి కమిషనర్‌కు తెలిపారు. కమిషనర్ గోల్నాక నుండి అంబర్ పేట్ వరకు అసంపూర్తిగా ఉన్న భూసేకరణ పనులను పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న భూసేకరణ పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. ఈ పర్యటనలో భాగంగా ముస్లిం కమ్యూనిటీ పెద్దలు ఈ ప్రాంతంలో అభివృద్ధికి జరిగేందుకు సహకరించడం జరుగుతుందని అధికారులకు పూర్తి సహకారం అందిస్తానని కమిషనర్‌కు వివరించారు. కొన్ని నిర్మాణాలకు కోర్టు అనుమతి ఇచ్చిన నేపథ్యంలో ఆ పనులను కొనసాగించాలని కమిషనర్ ఆర్‌అండ్‌బి అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట ఆర్‌అండ్‌బి ఎస్ఇ ధర్మారెడ్డి, అదనపు కమిషనర్లు శివకుమార్ నాయుడు, రఘుప్రసాద్, జోనల్ కమిషనర్ ఎన్.రవికిరణ్, డిప్యూటీ కమిషనర్ దివాకర్, జోనల్ ఎస్ఇ రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరు లైన్ల జాతీయ రహదారి విస్తరణకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

ప్రమాదాలు నియంత్రించేందుకే అండర్‌పాస్ బ్రిడ్జిలు

రూ.100కోట్ల నిధులు మంజూరు..టెండర్లు ఖరారు

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ప్రజాపక్షం/షాద్‌నగర్ : ఆరు లైన్ల జాతీయ రహదారి విస్తరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాయని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొదటి విడతలో కొత్తూరు వరకు ఆరు లైన్ల జాతీయ రహదారి ఎన్‌హెచ్44ను విస్తరించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని వివరించారు. నియోజకవర్గంలోని కొత్తూరు, పెంజర్ల, మేకగూడ, చటాన్‌పల్లి, బూర్గుల గ్రామ వద్ద సుమారు కిలో మీటర్‌కు పైగా అండర్ పాస్ బ్రిడ్జిలను నిర్మించేందుకు రూ.100కోట్ల నిధులు మంజూరు చేయడంతోపాటు టెండర్లు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. వచ్చే ఏప్రిల్ మొదటి వారంలోనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. రోడ్డు ప్రమాదాలను పూర్తి స్థాయిలో నియంత్రించేందుకే అండర్‌పాస్ బ్రిడ్జిల నిర్మాణాలను చేపడుతున్నట్లు తెలిపారు. జాతీయ రహదారి నుండి గ్రామాలను కలిపే విధంగా అండర్‌పాస్ బ్రిడ్జిల నిర్మాణాలకు శ్రీకారం చుట్టినట్లు వివరించారు. బూర్గుల, రాయికల్ మార్గాలను కలిపే విధంగా అండర్‌పాస్, జహంగీర్‌ఫీర్ దర్గా, నందిగామ మధ్యలో మరో అండర్‌పాస్ బ్రిడ్జిలను నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామ వద్ద చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళడం జరిగిందని, అందుకు సానుకూలంగా స్పందించిన నిధులు మంజూరు చేశారని వివరించారు. త్వరలోనే పెండింగ్‌లో ఉన్న ప్రాంతాల్లో సైతం సాంకేతిక పరంగా అండర్‌పాస్ బ్రిడ్జిలను నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, పురుషోత్తం రెడ్డి, బస్వం, రాయికల్ శ్రీనివాస్, లింగారెడ్డిగూడ అశోక్ పాల్గొన్నారు.

## హామీలు నెరవేర్చాలి

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుద్దుల జంగయ్య

ప్రజాపక్షం/కొందుర్గు/షాద్‌నగర్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లేడ్‌చౌదరిగూడ మండల పరిధిలోని తుమ్మలపల్లిలో గ్రామకార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15నెలలు కావస్తున్నా ఏ ఒక్క హామీ కూడా పూర్తి స్థాయిలో అమలు కావడం లేదన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు ఇంకా దరఖాస్తులు తీసుకుంటున్నారని, రూ.500 వందలకే గ్యాస్ సిలిండర్ కొంతమందికే వస్తుందని, రైతు బంధు పేరటరూ.12వేలు మాత్రమే కొంతమంది ఖాతాల్లో జమ చేశారని, మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని, ఇంతవరకు దాని ఉసేఎత్తడం లేదని ఆరోపించారు. సంక్షేమ పథకాలు అమలు చేయకుండా నాన్చుడు దోరణి అవలంభిస్తే ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి జిల్లెల్ల వెంకటేష్, ఎం.కృష్ణ, కె.బాల్‌రాజ్, ఎండి షబ్బీర్, అనంత, చిన్నయ్య, వీరేశం, రత్నయ్య, బాలమ్మ, అనిత పాల్గొన్నారు.



## గోల్డ్ స్కీమ్, చిట్టీల వ్యాపారం పేరుతో మోసం చేసిన వ్యక్తి అరెస్టు

ప్రజాపక్షం/షాద్‌నగర్: గోల్డ్ స్కీమ్, చిట్టీల వ్యాపారం పేరుతో కోటి రూపాయల వరకు టోకరా పెట్టిన వ్యక్తిని అరెస్టు చేసినట్టు షాద్‌నగర్ సిఐ విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. పట్టణంలోని అంకిత జువెల్లరి షాప్ యాజమాని నరేష్ లక్ష్మీ నరసింహ గోల్డ్ సేవింగ్ స్కీమ్, చిట్టీల వ్యాపారం పేరుతో ప్రజలకు మాయమాటలు చెప్పి కోటి రూపాయల వరకు టోకరా పెట్టినట్లు తెలిపారు. 2024 సెప్టెంబర్ 2న వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా అసలు విషయాలు బయటకు వచ్చాయని వివరించారు. నిందితుడు నరేష్ 2023లో పరిగి రోడ్డులోని అంకిత్ జువెల్లరి పేరుతో బంగారం షాపు ప్రారంభించారు. అదే సమయంలో గోల్డ్ స్కీమ్ పేరుతో నెలకు 1000చొప్పున 20నెలలు కడితే బంగారు వస్తువులు ఇస్తానని ప్రజల నుండి డబ్బులు వసూళ్ళు చేసి పరారయ్యాడని తెలిపారు. నరేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు షాద్‌నగర్ సిఐ విజయ్‌కుమార్ తెలిపారు. శంషాబాద్ డిసిపి రాజేష్, అదనపు డిసిపి రామ్‌కుమార్, షాద్‌నగర్ ఎసిపి రంగస్వామిల పర్యవేక్షణలో కేసును చేధించినట్లు వివరించారు. సమావేశంలో డిఐ వెంకటేశ్వర్లు, క్రైం డిఎస్ఐ శివరెడ్డి, క్రైమ్‌టీం సభ్యులు మోహన్, కరుణాకర్, జాకీర్, రాజు, రఫీ తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు గ్రూప్‌లైతే ఎస్‌సిలకు న్యాయం

మాల దాసరిలకు అండగా ఉంటా

మందకృష్ణ మాదిగ



ప్రజాపక్షం/ఖైరతాబాద్ : ఎస్‌సిలను నాలుగు గ్రూపులుగా చేసి, వర్గీకరణ అమలు చేస్తే అన్ని వర్గాలకు తప్పక న్యాయం జరుగుతుందని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. మాదిగ ఉపకులాలను గ్రూప్–1లో, మాదిగలను గ్రూప్–2లో, మాల ఉపకులాలను గ్రూప్–3లో, మాలలను గ్రూప్–4లో వేసి వర్గీకరణ అమలు చేయాలని కోరారు. వర్గీకరణలో నాల్గొవ గ్రూప్ ఏర్పాటు కాకుండా మాలలే అడ్డుకొంటున్నారని ఆరోపించారు. మంగళవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో తెలంగాణ రాష్ట్ర మాల దాసరి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రేల్ల సోమయ్య అధ్యక్షతన మాల దాసరులను గ్రూప్–1లో చేర్చాలని కోరుతూ సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా మందకృష్ణ మాదిగ హాజరై, మాట్లాడుతూ మాలలలోని కొంతమంది స్వార్థపరులు వర్గీకరణ చట్టబద్ధత కాకుండా అడ్డుకొంటున్నారన్నారు. జస్టిస్ అక్తర్ కమిషన్ నివేదికలో కొన్ని లోపాలున్నాయని వాటిని సవరించాలని, తాము చేసిన విజ్ఞప్తికి స్పందించి, కమిషన్ గడువు మార్చి 10తేదికి పొడిగించిందని, అందుకు సిఎం రేవంత్‌రెడ్డికి, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. మాల దాసరి కులస్థులకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. మాలలను గ్రూప్–4లో చేరిస్తేనే మాల ఉపకులాలకు న్యాయం జరుగుతుందని, ఈ విషయంపై ప్రభుత్వంపై దృష్టి సారించాలని కోరారు. సదస్సులో మాజీ ఎంపి వెంకటేశ్, మాల దాసరి సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి, వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపల్లి ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో రేణుక ఎల్లమ్మ పూజలు



ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: భక్తిశ్రద్ధలతో శ్రీ రేణుక ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ఫరూక్‌నగర్ మండల పరిధిలోని రాయికల్ గ్రామంలో దూసకల్ గ్రామానికి చెందిన నక్కల స్వరూప సత్యనారాయణ గౌడ్‌ల కుమారుడు డాక్టర్ నక్కల విక్రమాదిత్య గౌడ్ జ్ఞాపకార్థం నూతనంగా ఏర్పాటు చేసిన దేవాలయ కమాన్‌ను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిలు ప్రారంభించారు. కార్యక్రమంలో శ్యాంసుందర్‌రెడ్డి, శివశంకర్‌గౌడ్, బస్వం, చెంది తిరుపతిరెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, బక్కన్న యాదవ్, ఆశన్న గౌడ్, రాములుగౌడ్, రాయికల్ శ్రీనివాస్, వేణుగౌడ్, మోహన్‌రెడ్డి, ఖదీర్, తుపాకుల శేఖర్, కృష్ణ, చంటి శ్రీనివాస్‌గౌడ్, సుభాష్‌గౌడ్, రవీందర్‌గౌడ్, మల్లేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### కన్నుల పండువగామహాపడిపూజ

కన్నుల పండువగా శివస్వాముల మహాపడిపూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఉప్పరిగడ్డ గ్రామ పంచాయతీలో మాజీ సర్పంచ్ సుమిత చందునాయక్ ఆధ్వర్యంలో గురుస్వామి కమ్మరి భూపాలచారి సహకారంతో శివస్వాముల మహాపడిపూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శివనామ స్మరణతో గ్రామం ఒక్కసారిగా మారుమ్రోగిపోయింది. శివస్వాముల భక్తి గీతాలు, స్తోత్రాలు భక్తులను ఎంతగానో అకట్టుకున్నాయి. ప్రతి ఒక్కరు క్రమ శిక్షణ, గురుభక్తి తల్లిదండ్రుల సేవ, భగవంతుడి భక్తిని అలవర్చుకోవాలని గురుస్వామి సూచించారు. మహా పరమశివుడి లీలలు ఎన్నో రకాలు ఉంటాయని, ఓంకార నినాదం స్మరిస్తూ భక్తులు స్వామిని కొలిస్తే కొరిన కోరికలు తీరుతాయని గురుస్వామి వివరించారు. మాజీ సర్పంచ్ సుమిత చందునాయక్ మాట్లాడుతు శివస్వాములకు అన్నప్రసాద వితరణ చేసుకోవడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాపడి పూజ కార్యక్రమంలో భక్తులు ఈర్ల యాదయ్య, రాజు, బోజ్జా, తిక్కన్న, వెంకటేష్, చిన్నయ్యతోపాటు గ్రామస్తులు, శివస్వాములు పాల్గొన్నారు.



## కుల గణన రీసర్వేలో పాల్గొనండి




బిసి కమిషన్ సభ్యుడు రాపోలు

ప్రజాపక్షం/సరూర్‌నగర్ : కుల గణన రీసర్వేలో పాల్గొని కులాల అస్తిత్వాన్ని కాపాడాలని బిసి కమిషన్ సభ్యుడు రాపోలు జయప్రకాష్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణనలో పలు ఆరోపణలు వచ్చినందున తిరిగి సర్వే చేపట్టినందున రాపోలు జయప్రకాష్ మంగళవారం ఆర్‌కెపురం డివిజన్‌లోని పలు కాలనీలలో పర్యటించి కులగణనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం సర్వే చేపట్టినందున గతంలో నమోదు చేసుకోని వారు తప్పనిసరిగా తమ పేర్లను కులాల వారీగా నమోదు చేసుకోని ప్రభుత్వానికి కుల సంఘాల అభివృద్ధికి సంక్షేమానికి దోహదపడాలన్నారు. కులగణన సర్వే సమగ్రంగా చేయించేందుకు బిసి కమిషన్ చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో పున్నా గణేష్ నేత, బండి మదుసూదన్‌రావు, గట్ల రవీంద్ర, తల్లాటి రమేస్‌నేత, శివ, ధన్‌రాజ్‌గౌడ్, గుండా నరసయ్య, జగన్నాథం, చంద్రమౌళి పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

ప్రజాపక్షం/కొందుర్గు: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ వైస్ ఎంపిపి రాజేష్ పటేల్ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీఉమా మహేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో నూతనంగా నిర్మాణం చేసిన హనుమాన్ దేవాలయంలో శ్రీనాగ ధ్వజ స్థంభ, శిఖర ప్రతిష్టాపణలో భాగంగా మంగళవారం హోమం, అఖండ దీపారాధన, అఖండ భజన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో కందుకల లక్ష్మయగౌడ్, కావలి యాదయ్య, చేవెళ్ల కృష్ణయ్య, ఎస్.యాదగిరి, బి.నర్సింలు, కె.రాములు గౌడ్, కె కృష్ణయ్య గౌడ్, ఎం వేణుగోపాల్ గౌడ్, కె శ్రీశైలం, జి వేణుగోపాల్, బి శ్రీశైలం,జి నరేందర్ గౌడ్, కె సుధాకర్, భరత్, రవి పాల్గొన్నారు.

## గృహిణి అదృశ్యం

ప్రజాపక్షం/మల్కాజిగిరి : భర్త మందలించాడంటూ ఓ మహిళ ఇంటి నుండి వెళ్లి అదృశ్యమైన ఉందంతం నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం నేరేడ్‌మెట్‌లోని ఆదర్శనగర్ కాలనీలో నివసించే గోరంట్ల మాధవి(35) తరచు ఫోన్‌లో మాట్లాడుతూ తనను నిర్లక్ష్యంగా చూస్తున్నావంటూ సోమవారం భర్త రవి మందలించటంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఆ తర్వాత ఇంటి నుండి బయటకు వెళ్లిన ఆమె రాత్రయినా ఇంటికి చేరుకోక పోవటంతో ఆమె జాడ కోసం బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఫలితం లేక పోవటంతో లిఖిత పూర్వకంగా ఇచ్చిన ఫిర్యదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# మహానగరి



మర్పల్లి మండల పరిధిలోని కోత్లపూర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్‌కు వైద్య చికిత్సకోసం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో రూ.80వేలు ఎల్ఒసి మర్పల్లి మండల పార్టీ అధ్యక్షులు సురేష్‌యాదవ్ అధ్వర్యంలో స్పీకర్ ప్రసాద్ కుమార్ అందజేశారు.

## తాండ వాసుల జీవితం అతలాకుతలం



ప్రజాపక్షం/దుండిగల్ : రాంకీ వెస్ట్ మేనేజ్మెంట్ నుండి వస్తున్న విషపూరితమైన వాయుకాలుష్యంతో దుండిగల్ వాసులకు చుట్టుపక్కల ప్రజలకు శాపంగా మారింది రాంకీ పవర్ ప్లాంట్ నుండి విడుదల అవుతున్న దట్టమైన విషపూరితమైన కాలుష్యం విడుదలవడంతో రోగాల బారిన పడి తమ ప్రాణాలను వదిలేస్తున్నారు. గ్రీన్ ట్రిబ్యునల్ లో ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని స్థానిక వార్డు మాజీ కౌన్సిలర్ కోర శంకర్ నాయక్ వాపోయారు. రోజువారి విడుదల అవుతున్న కెమికల్ వ్యర్థాలను దంపింగ్ చేస్తుండడంతో దుర్వాసనతో అంతు చిక్కని రోగాల బారిన పడుతున్నారని, పరిశ్రమపై చర్య తీసుకొని తమ ప్రాణాలను కాపాడాలని అన్నారు. కెమికల్ వ్యర్థాలను దుండిగల్ తాండా ఉన్న డంపింగ్ యార్డులో రాత్రికి రాత్రి డంపింగ్ చేస్తుండడంతో దుర్వాసన వేదజల్లుతూ స్థానిక ప్రజలు అనారోగ్యం భారిన పడుతున్నారు. పిసిబి అధికారులకు కెమికల్ వ్యర్థాల డంపింగ్ పై ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. పిసిబి అధికారుల సహకరిస్తున్నారని తక్షణమే రాంకీ కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని తాండ వాసులు వాపోతున్నారు.

## జిల్లా ఆర్‌టిఎ సభ్యుడు జైపాల్‌రెడ్డికి సన్మానం



ప్రజాపక్షం/శామీర్‌పేట : మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా రీజినల్ అథారిటీ (ఆర్‌టిఎ) మెంబర్‌గా నూతనంగా నియామకమైన తూంకుంట మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు బీమిడి జైపాల్‌రెడ్డి ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మందుముల పరమేశ్వర్‌రెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్‌టిఎ సభ్యుడు జైపాల్‌రెడ్డిని పరమేశ్వర్‌రెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీసీతారామస్వామి దేవస్థానం చైర్మన్ పెండెం లక్ష్మీ నారాయణ(నాని), ధర్మకర్త బీమిడి సంజీవరెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు వజ్జల శశాంత్, యూత్ కాంగ్రెస్ నాయకులు వెంకటేష్, భానచందర్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## బాలు మృతదేహం లభ్యం



ప్రజాపక్షం/శామీర్‌పేట : శామీర్‌పేట మండలం పొన్నాల్‌లోని చిత్తారమ్మ చెరువులో పడి మృతి చెందిన పాలసంతుల బాలు మృతదేహం మంగళవా రం లభ్యమైందని శామీర్‌పేట పోలీసులు తెలిపారు. ఈ నెల 16న జగద్గిరిగుట్ట, నాగారంకు చెందిన ఆరుగురు యువకులు పొన్నాల్‌లోని చిత్తారమ్మ అమ్మవారి దర్శానానికి వచ్చారు. వీరిలో ముగ్గురు చెరువులో ఈత కొడదామని దిగారు. ఇందులో ఒకరు బయటకు రాగ అలకంటి సందీప్‌సాగర్(27), పాలసంతుల బాలు(25) చెరువులో మునిగిపోయారు. శామీర్‌పే ట పోలీసులు, ఫైర్ సిబ్బంది, గజఈతగాళ్ల సహాయంతో అలకంటి సాగర్ మృతదేహాన్ని సోమవారం బయటకు తీశారు. బాలు ఆచూకి కోసం పోలీసులు చెరువులో గాలింపు చర్యలు చేపడుతుండగా మంగళవారం పాలసంతుల బాలు మృతదేహం చెరువులో తేలింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించామని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## నాణ్యతలేకుండా సిసి రోడ్డు పనులు



ప్రజాపక్షం/కోట్‌పల్లి/వికారాబాద్ : వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా ఎన్ఆర్‌జిఎస్ పనులు గ్రామల్లో జోరుగా పనులు జరుగుతున్నాయి. ఇందులో అధికార పార్టీ నాయకులు పనులు చేస్తున్నారు. కాని ఎక్కడా కూడా ఇసుక వాడ టం లేదని, సీసీ రోడ్లు పనుల్లో నాణ్యత పాటించడం లేదని పలు గ్రామాల గ్రామస్తులు తెలుపుతున్నారు. కోట్‌పల్లి పరిధిలోని మండలంలోని రాంపూర్ గ్రామం ఎస్‌సి కాలనీ అంబేద్కర్ విగ్రహం సమీపంలో రూ.5 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను గ్రామస్తులు కాంట్రాక్టర్‌ను అడిగి నాణ్యతతో వే యాలని లేదంటే పనులను చేయవద్దని కాసేపు వాగ్వాదానికి దిగారు. దీం తో సదరు కాంట్రాక్టరు నేను ఇలాగే చేస్తాను మీరేవరికి చుప్పుకుంటారో చే ప్పుకోండని దబాయించగా కొందరు కాలనీ వాసులు సంబంధిత డిఇకి ఫోన్ చేసి నాణ్యత లేకుండ సీసీ రోడ్డు పనులను చేస్తున్నారని, అట్టి పనుల ను నిలిపివేయాలని సూచించారు. ఇలాగే నాణ్యత లేకుండా పనులు చేస్తే కలెక్టర్ దృష్టికి తీసుకుపోతామని కాలనీ వాసులు తెలిపారు.వికారాబాద్ మండల పరిదిలోని బురన్‌పల్లి గ్రామంలో సంవత్సరం కాక ముందే సీసీరెడ్డి పగిలిపోయింది. కాని రాజకీయ పలుకుబడి ఉన్నందున సీసీరోడ్డును పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

## నవాబుపేట్‌లో బిఆర్ఎస్ బలోపేతానికి కృషి : సుధాకర్

ప్రజాపక్షం/నవాబుపేట్ : రాబోయే స్థానిక ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ సత్తా చూపిస్తామని మండల బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధి కడిచర్ల సుధాకర్ అన్నారు. నవాబుపేట మండలం మాదారం గ్రామానికి చెందిన కడిచర్ల సుధాకర్ మండల బిఆర్ఎస్ అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. నవాబుపేట బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు దయాకర్ రెడ్డి, ముఖ్య సలహాదారు మందుల విజయ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఘనపురం శాంతికుమార్, ప్రధాన కార్యదర్శి మహేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పార్టీలో కష్టపడి పని చేసేవారికి తగు ప్రాధాన్యత గుర్తింపు ఉంటుందన్నారు. బిఆర్ఎస్ మండల అధికార ప్రతినిధిగా నియమితులైన కడిచర్ల సుధాకర్ మాట్లాడుతూ ఈ పదవి రావటానికి తనను ప్రోత్సహించిన విజయ్ కుమార్, మహేశ్వర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నట్లు తెలిపారు. అదే విధంగా బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు.





# నాడు పని కోసం ఒత్తిడి నేడు డబ్బు చెల్లింపులో తాత్సారం

ప్రజావాణిలో అధికారుల ముట్టడి

సమగ్ర కుటుంబ సర్వే ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్ల ఆందోళన

రెండు మాసాలు పూర్తయినా బకాయిలు చెల్లించటంలో కుంటి సాకులు



ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి : సమగ్ర కుటుంబ సర్వే పూర్తయి రెండుమాసాలు పూర్తయినా ఉదయం నుండి రాత్రి దాకా ఇంటింటికి తిరిగి సర్వే చేసిన ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు గౌరవ వేతనాలు మాత్రం చెల్లించటంలో మేడ్చల్ జిల్లా అధికారులు కాలయాపన చేస్తున్నారు. ఎన్ని సార్లు మొర పెట్టుకొంటున్నా ఎలాంటి స్పందన లేక పోవటంతో చివరికి సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమాన్ని సర్వేలో పాల్గొన్న ఎన్యుమరేటర్లు తమకు ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించాలంటూ అధికార్లను ముట్టడించారు. సర్వే సమయంలో రోజు వారీ టార్గెట్‌లు విధించి మరీ తీవ్రమైన ఒత్తిడి తేవటం ద్వారా సమగ్ర కుటుంబ సర్వే లక్ష్యాన్ని పూర్తి చేయించుకొన్న జిల్లా అధికారులు తమకివ్వాల్సిన డబ్బుల విషయంలో మాత్రం టెక్నికల్ తదితర కుంటి సాకులు చెబుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ తీవ్రంగా దుయ్యబట్టారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే నిర్దేశించిన సమయంలో పూర్తి చేసేందుకు గాను మేడ్చల్ జిల్లా యంత్రాంగం ఇంటింటికి తిరిగి వివరాలను సేకరించేందుకు గాను అంగన్‌వాడి టీచర్లు, ఆశ కార్యకర్తలు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, అధికారులను ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లుగా, వివరాలను నమోదు చేసేందుకు డాటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించుకొన్నారు. ఎన్యుమరేటర్లకు రూ. 10 వేలు, సూపర్‌వైజర్లకు రూ.12 వేలు గౌరవ వేతనంగా ఇస్తామని, డాటా ఎంట్రీ ఆపరేటర్లకు ఒక్కో ఇంటి వివరాలతో ఉన్న ఒక్కో ఫారానికి గాను రూ. 30 చొప్పున ఇస్తామని చెప్పారు. గతేడాది నవంబరు 6వ తేదీన ప్రారంభమైన సమగ్ర కుటుంబ సర్వే 40 రోజుల పాటు కొనసాగింది. ఈ విధంగా మేడ్చల్ జిల్లాలోని మేడ్చల్ మున్సిపాలిటిలో 128 మంది ఎన్యుమరేటర్లు, 13 మంది సూ పర్‌వైజర్లు, పోచారం మున్సిపాలిటిలో 91 మంది ఎ న్యుమరేటర్లు, 11 మంది సూపర్‌వైజర్లు, జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 229 మంది ఎన్యుమరేటర్లు, 14 మంది సూపర్‌వైజర్లు, ఫిర్జాదిగూడ మున్సిపాలిటి కార్పొరేషన్‌లో 245 మంది ఎన్యుమరేటర్లు, 26 మంది సూపర్‌వైజర్లు, నాగారం మున్సిపాలిటిలో 128 మంది ఎన్యుమరేటర్లు, 13 మంది సూవర్‌వైజర్లు, కీసరలో 81 మంది ఎన్యుమరేటర్లు, 8 మంది సూపర్‌వైజర్లు, ఘట్‌కేటసర్ మున్సిపాలిటిలో 119 మంది ఎన్యుమరేటర్లు, 14 మంది సూపర్‌వైజర్లు పని చేసారు. వీరితో పాటు గుండ్ల పోచంపల్లి, తూంకుంట మున్సిపాలిటి, గ్రేటర్ పరిధిలోనూ ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు సర్వేలో పాల్గొన్నారు. ఒక్క మేడ్చల్ మన్సిపాలిటీలో పని చేసిన ఎన్యుమరేటర్లకు రూ. 12.8 లక్షలు, సూపర్‌వైజర్లకు 1.53 లక్షలు బకాయి చెల్లించాల్సి ఉంది. ఈ విధంగా జిల్లా మొత్తంగా వీరికి చెల్లించాల్సింది కోట్ల రూపాయల్లోనే ఉంది. వీరితో పాటు సర్వే వివరాలను నమోదు చేసిన డేటా ఎంట్రీ ఆపరేటర్లకు సైతం జిల్లా యంత్రాం గం బకాయిలు చెల్లించాలి.

## నక్ష సర్వే ఫైలెట్ ప్రాజెక్టుతో కొడంగల్ అభివృద్ధి

కడ అధికారి వెంకట్‌రెడ్డి





ప్రజాపక్షం / కొడంగల్ : కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో నక్ష పథకం కింద డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్ మోడ్రినిస్టేషన్ ప్రోగ్రమ్ ) ఫైలెట్ ప్రాజెక్టు పనులను మంగళవారం సెంట్రల్ గవర్నమెంట్ నేతృత్వంలో అధికారులు లాంచనంగా ప్రారంబించారు. ఈ సందర్భంగా కడ అధికారి వెంకట్‌రెడ్డి మాట్లాడుతు భారతదేశ వ్యాప్తంగా 152 పట్టణ స్థానిక సంస్థ లు ఫైలెట్ టౌన్ సర్వే ప్రోగ్రం కోసం ఎంపిక చేయడం జరిగిందని అందులో తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషితో కొడంగల్ నియోజకవర్గంతో పాటు మరో 9 నియోజకవర్గాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. అందులో బాగంగానే హెలిక్యాప్టర్ ద్వారా అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించి ప్రతి అంగుళం భూమిని జియో కార్డినేట్స్ సహాయంతో సర్వే చేయడం జరుగుతుందన్నారు. కొడంగల్ ఎన్ని ఎకరాల భూమి ఉంది. ఎన్ని ఎకరాలు అన్యక్రాంతం అయిందో దీని ద్వారా తెలిసిపోతుందన్నారు. ప్రతి ఒక్క అర్హత కల్గిన భూ యజమానులకు నెంబర్ కోడ్‌లు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఖచ్చితమైన భూసంసిద్ధతా నమోదు సమర్థవంతమైన పట్టణ ప్రణాళికను రూపోందించడానికి ఇది ఎంతగానో సహాయపడుతుందన్నారు. ప్రభుత్వాలు వనరులను సమర్థవంతంగా కేటాయించడానికి మౌళిక సదుపాయలను ప్రణాళికబద్ధంగా అమలు చేయడానికి మరియు జోనింగ్ నిబంధనలను అమలు చేయడానికి సహాయపడుతుందని ఆశభావం వ్యక్తం చేశారు. ఆస్తి విలువలను అంచనా వేయడం పన్నులను సముచితంగా విధించడం మరియు సమర్థవంతంగా వసూళ్ళు చేయడానికి కృషి చేస్తుందని అన్నారు. ముందుగా కొడంగల్ పట్టణంలోని హెలిప్యాడ్ వద్ద అధికారులు, పట్టణ ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు, స్థానికులతో కలిసి అధికారులు సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి ల్యాండ్ హెలిక్యాప్టర్ భూ సర్వే ఏ విధంగా చేస్తారు. ఎందుకు చేస్తున్నారు. ఎన్ని రోజులు చేస్తారో ప్రతి అంశంపై క్లుప్తంగా వివరించారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ చైర్మెన్ రాజేశ్‌రెడ్డి, కొడంగల్ మార్కెట్ కమిటి డైరెక్టర్ అసీఫ్‌ఖాన్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ ఉషారాణి, మాజీ కౌన్సిలర్‌లు మధుసూదన్‌యాదవ్, శంకర్ నాయక్, బిఎం రమేష్, యూత్ కాంగ్రెస్ జాతీయ కోఆర్డినేటర్ కృష్ణంరాజు, మున్సిపల్ మాజీ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ మునీర్, అర్గె ఓం ప్రకాశ్, మిఠాయిరాజు, యూత్ కాంగ్రెస్ నాయకులు నయ్యూం తదితరులు పాల్గోన్నారు.

## అంబేద్కర్ విగ్రహా ప్రతిష్టాపనకు విరాళం

బివిజి పౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ సంపత్‌కుమార్

ప్రజాపక్షం/తాండూరు : మండల పరిధిలోని కందనెల్లి గ్రామ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న అంబేద్కర్ విగ్రహా ప్రతిష్టాపనకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బీవిజి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ సంపత్ కుమార్ తమ వంతు సహాయంగా విరాళాన్ని అందజేశారు. మంగళవారం కందనెల్లి గ్రామ అంబేద్కర్ యుజన సంఘం సభ్యులు తాండూరులోని డాక్టర్ సంపత్ కుమార్ కలిశారు. గ్రామంలో నూతన ఏర్పాటు చేయనున్న అంబేద్కర్ విగ్రహా ప్రతిష్టాపనకు సహాయం అందించాలని కోరగా వెంటనే స్పందించిన డాక్టర్ సంపత్ కుమార్ తమ వంతు సహాయంగా విరాళాన్ని యువజన సంఘం సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యుజన సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు ఉన్నారు.



## అల్వాల్ సిఐ రాహుల్ దేవ్‌ను అభినందించిన నాయకులు



ప్రజాపక్షం/అల్వాల్ : అల్వాల్ సిఐ రాహుల్ దేవ్‌కు ఉత్తమ జాతీయ పోలీస్ అవార్డు వచ్చిన నేపథ్యంలో రాష్ట్ర ఒబిసి నాయకులు చిత్రాల సంతోష్ కుమార్ సాగర్ ఆధ్వర్యంలో సిఐ రాహుల్ దేవ్‌ను శాలువతో సత్కరించి అభినందించారు. అల్వాల్ పోలీస్ స్టేషన్‌కు కొత్తగా వచ్చిన ఎస్ఐలను సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అల్వాల్ సర్కిల్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు అశోక్ కుమార్, సాయికుమార్, సాయి నాయుడు, మల్లేష్ యాదవ్, రాము, ఉదయ్, శేఖర్ సాగర్, సురేష్, ఆకాష్, అంజాద్, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

ప్రజాపక్షం/అల్వాల్ : తెలంగాణఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్ రావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు పరచాలని ఉద్యమకారులకు 250 గజాలు చొప్పున స్థలం కేటాయించాలని గుర్తింపు కార్డులు బస్ పాసులు స్వతంత్ర సమరయోధులకు బెనిఫిట్ ఇచ్చిన విధంగా తెలంగాణ ఉద్యమకారులకు కూడా ఇవ్వాలని పోస్ట్ కార్డుల ఉద్యమం చేపట్టారు. త్వరలో 33 జిల్లాలలో పోస్ట్ కార్డు ఉద్యమము ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల రాష్ట్ర జనరల్ సెక్రెటరీ పట్లోళ్ల సురేందర్ రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు గుండు దయానంద్, మల్కాజ్గిరి ఫోరం అధ్యక్షుడు పుట్నాల కృష్ణ, కొండ స్వామి, బాబు, పోచన్న, అనిల్, ఆనంద్, అనంత లక్ష్మి, నర్సిన్, శోభ, తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్



ప్రజాపక్షం/దోమ : దోమ మండల పరిధిలోని స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్‌ను దోమ మండల విద్యాధాకారి వెంకట్ రివ్వు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ స్కూల్ ఎంరోల్మెంట్ క్లాస్ వారిగా బాలురు ,బాలికలు వివరాలను ఎఫ్ఎ1, ఎఫ్ఎ2, ఎస్ఎ2, ఎఫ్3లను అన్‌లైన్‌లో ఎంట్రీ వందశాతం చేయాలని ఆదేశించారు. ఎఫ్ఎల్ఎన్ ,ఎఐఎవ్ , అపార్ ఐడి జనరేషన్ పూర్తి చెయ్యాలి , బడికి రాని పిల్లల సామాచారం , టాయిలెట్స్ లేని స్కూల్ , కాంపౌండ్ వాల్ ,కిచెన్ షెడ్ వివరాలను నమోదు చేయాలని తెలిపారు అన్‌లైన్ వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కిష్టాపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు లాల్యానాయక్ తదితరులు పాల్గోన్నారు.

## పేదలకు వేలాది ఎకరాలు పంచిన చరిత్ర సత్తయ్యది

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సిపిఐ కార్యదర్శి ఉమామహేష్



ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్: వేలాది ఎకరాలను పేద ప్రజలకు పంచిన చరిత్ర కామ్రేడ్ సత్తయ్యకు దక్కుతుందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సిపిఐ కార్యదర్శి ఉమామహేష్ అన్నారు. కామ్రేడ్ సత్తయ్య 7వ వర్ధంతి సందర్భంగా మాజీ కౌన్సిలర్ నరసయ్య అధ్యక్షతన మంగళవారం గుబురు గుట్ట లో గల వారి స్మారక స్థూపం వద్ద నిర్వహించిన వర్ధంతి వేడుకలకు ఆయనతో పాటు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యేసురత్నంలు పాల్గొని పూల మాలలు వేసి నివాళ్ళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఐ కుత్బుల్లాపూర్ మాజీ మండల కార్యదర్శి గిరినగర్, జగద్గిరిగుట్ట, గుడెంమెట్ , మగ్దూం నగర్, లెనిన్ నగర్, రావినారాయణ రెడ్డిరనగర్ లాంటి అనేక బస్తీలను నిర్మించారన్నారు. ఆటో యూనియన్ నుంచి మొదలు కోని పోట్లూరి నాగేశ్వర్ రావు చేత సిపిఐ పార్టీ నాయకత్వం 1970 లొ సత్తయ్య సిపిఐ పిలుపు మేరకు భూపోరాటం కార్యక్రమానికి నాయకత్వం వహించి వేలాది ఎకరాలు పేదలకు పంచారన్నారు. సత్తయ్య, నాగయ్యలు కలిసి ఎన్నో బస్తీలు నిర్మించారని, వారి నిస్వార్థ పోరాట ఫలితమే నేడు వేలాది మంది ఇక్కడ నివసించడానికి కారణమైయ్యారన్నారు. ప్రతి ఒక్కరూ వారు చేసిన సేవలను ప్రజలకు తెలియజేసి వారిని ప్రజల్లో చిరస్థాయిగా నిలబెట్టడానికి ప్రయత్నం చేయాలని కార్యకర్తలను కోరారు. కామ్రేడ్ నాగయ్య, సత్తయ్యలు అనేక పోరాటాలు చేసి ఎన్నో ఎకరాలు పంచినప్పటికి వారి సోంతానికి ఎదగలేదని అది సిపిఐ ఇచ్చినటువంటి స్పూర్తి అని అన్నారు. ఆ స్పూర్తితోనే నేటి కార్యకర్తలు పని చేయాలని, డబ్బు, పదవి ఇవేవి శాశ్వతం కాదని , ప్రజలకు చేసే సేవనే శాశ్వతం అని గుర్తు పెట్టుకుని రాజకీయాలు చేయాలని సూచించారు. వారి సహచరులు బాల నర్సయ్య, నరసయ్య, వారు చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. ఎఐటియుసి నియోజకవర్గం అధ్యక్షులు హరినాథ్, మండల సహయ కార్యదర్శి దుర్గయ్య, డిహెచ్‌పీఎస్ నాయకులు రాములు కూడా ప్రసంగించారు. ఎఐటియుసి జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ నాయకత్వం వహించిన కార్యక్రమంలో శాఖ కార్యదర్శి యాకుబ్, ప్రజానాట్య మండలి అధ్యక్షులు బాబు, మల్లేష్, మల్లయ్య, ఖాదర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## దుండిగల్ ప్రజలకు అండగా ఉంటా

ప్రజాపక్షం/దుండిగల్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్ లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ తన నివాసం వద్ద దుండిగల్ గ్రామ ప్రజలు తనతో కలిసి వారి సమస్యలను వివరించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో దుండిగల్ గ్రామంలో సర్వే నెంబర్ 453,454 లలో ఆర్టిఓ ఆఫీస్ ఏర్పాటు కోసం కేటాయించిన 40 ఎకరాల భూమిని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసి మాకు న్యాయం చేయాలని కోరారు. బిఆర్ఎస్ నాయకులు మాకు పట్టాదారు పాసు పుస్తకాలు ఇపిస్తామని మాయమాటలు చెప్పి మోసం చేసారన్నారు. దుండిగల్ గ్రామ ప్రజలు,రైతులు తమకు న్యాయం చేయాలని విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, దుండిగల్ గ్రామ ప్రజలు రైతులు అధైర్యపడవద్దు మీ అందరికీ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సమస్యను మన ఇంచార్జ్ మంత్రివర్యులు శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్ ల ఫోరం మాజీ అధ్యక్షుడు దుండిగల్ మాజీ సర్పంచ్ కావాలి గణేష్, మాజీ ఎంపీటీసీ బండారి మహేష్, మాజీ వార్డు సభ్యులు పిట్లా నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



## ఆలయ అభివృద్ధికి పాటుపడుతున్న వజ్రేష్

రూ. 50 లక్షల టెండర్ జారీతో గజమాలతో సన్మానం

ప్రజాపక్షం/శామీర్‌పేట : శ్రీవిష్ణు శివాలయాభివృద్ధికి టిపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేషయాదవ్ పాటుపడుతున్నారని ఆలయానికి నిధులు కేటాయించడంలో వజ్రేషయాదవ్ కీలక పాత్ర పోషించారని మాజీ సర్పంచ్ దోసకాయల వెంకటేష్ అన్నారు. మంగళవారం బోడుప్పల్‌లోని వజ్రేష్‌యాదవ్ నివాసానికి తరలిన గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు టిపిసిసి ఉపాధ్యక్షుడు వజ్రేషయాదవ్‌ను గజమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ మూడుచింతలపల్లి మండలం ఉద్దెమర్రిలో అక్కన్న మాదన్నలు నిర్మించిన అతి పురాతణమైన శ్రీవిష్ణు శివాలయాలు అభివృద్ధికి నోచుకోవడం లేదని ఇట్టి విషయాన్ని వజ్రేషయాదవ్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. వెంటనే ఆలయాన్ని సందర్శించిన వజ్రేషయాదవ్ దేవాదయ ధర్మదాయ శాఖ మంత్రి, కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి రూ. 50 లక్షలు కేటాయించి టెండర్‌లు జారీ చేయించారని చెప్పారు. ఇందుకు కృతజ్ఞతగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు వజ్రేషయాదవ్‌కు దన్యవాదాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజి సర్పంచ్ బాల్ నర్సింహా, సీనియర్ నాయకులు విష్ణుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## కీసర బ్రహ్మోత్సవాల్లో భక్తులకు సకల ఏర్పాట్లు



ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి : శివరాత్రి సందర్భంగా కీసరగుట్టలో జరిగనున్న బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ, ప్రభుత్వ అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సూచించారు. ఉత్సవ ఏర్పాట్ల విషయమై మంగళవారం దేవాలయ కార్యాలయంలో ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి, కమిటి చైర్మన్ నారాయణ శర్మ, ఈఓ సుధాకర్‌రెడ్డి, జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పఖ్యాత కీసర గుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి సందర్భంగాజరిగే బ్రహ్మోత్సవాల్లో ప్రతీ ఏటా మాదిరి భారీ సంఖ్యలో హాజరయ్యే భక్తులకు పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. భక్తులకు అవసరమయ్యే పూజా సామగ్రి, ఆహార పదార్థాలు, ఇతర వస్తువులను వ్యాపారులు అధిక ధరలకు విక్రయించకుండా చూడాలని, అలాంటి వారిపై అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులు దైవదర్శనం చేసుకొనేందుకు క్యూ లైన్లను పెంచటం ద్వారా ఎలాంటి తొక్కిసలాటలు, ఆలస్యం జరుగకుండా చూడాలని, మహిళలు, సీనియర్ సిటిజన్లు, పిల్లలకు ప్రత్యేక ఏర్పాట్లు ఉండాలన్నారు. వాహనాల పార్కింగ్‌లో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా తగిన రీతిలో బారికేడ్లు ఏర్పాట్లు చేయాలన్నారు. అవసరమైన చోట్ల తాత్కాలిక టాయిలెట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆలయ పరిసరాలు, భక్తులు రాక పోకలు చేసే రహదార్లలో ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరా ఉండే లా చూడాలని, గజ ఈతగాళ్లు, అంబులెన్సులు, అవసరమైన సందర్భంలో వైద్యం అందించేందుకు మందులతో పాటు వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండే ఏర్పాట్లు చేయాలంటూ సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు గాను ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలంటూ ఆర్టీసీ అధికారులకు సూచించారు. అన్ని శాఖల సమన్వయంతో సమీకృత కంట్రోల్ రూం ఏర్పాటు చేసుకొని ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసు విభాగం బందోబస్తు ఏర్పాట్లు చూడాలన్నారు. కీసరగుట్ట ప్రాంతంలో ఉన్న చెరువు దగ్గర అందుబాటులో గజ ఈతగాళ్లు ఉండాలన్నారు. భక్తులకు అవసరమైన ఆన్‌లైన్ టికెట్ సౌకర్యంతో కూడిన ఆలయ వెబ్‌సైట్‌ను అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ప్రారంభించారు.

